

సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## అసెంబ్లీని సందర్శించిన మేఘాలయ అసెంబ్లీ సభ్యుల బృందం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై8, ప్రభాతవార్త:** మేఘాలయ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యేల బృందం మంగళవారం రాష్ట్ర అసెంబ్లీని సందర్శించారు. హైదరాబాద్ లోని అసెంబ్లీ కమిటీ హాల్ లో మేఘాలయ రాష్ట్ర బృందానికి పిఎసి చైర్మన్ ఆర్కెపూడి గాంధీతో కలిసి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారితో సమావేశమై తెలంగాణ, రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల గురించి సభ్యులకు వివరించారు. అసెంబ్లీ నిర్వహించే విధానంతో పాటు, అసెంబ్లీ లో ప్రజా సమస్యల్ని పరిష్కరించడానికి చేసే చట్టాలను మరియు రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వారికి ఎమ్మెల్యే యెన్నం వివరించారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలో "విద్యా నిధి" ఏర్పాటు , మహబూబ్ నగర్ ఫస్ట్ లక్ష్యాలను, నిరుద్యోగ యువతకు ఇచ్చే ఉచిత కోచింగ్, నైపుణ్య శిక్షణ సెంటర్ గురించి కూడా వారికి వివరించారు. ఈ సందర్భంగా మేఘాలయ అసెంబ్లీ సభ్యుల బృందం అసెంబ్లీ సమావేశాల గురించి, ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి గురించి , మహబూబ్ నగర్ విద్యా నిధి గురించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేఘాలయ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ చార్లెస్ పిన్గ్రోప్, ఎమ్మెల్యేలు లహ్క్మెన్ రింబుల్, రూపాలీ, మార్క్, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి నర్సింహా చార్యులు పాల్గొన్నారు.


# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట


### ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా

## నిలిచిన మహనీయుడు

**వైఎస్ జయంతి వేడుకల్లో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేల అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల, జూలై8, ప్రభాతవార్త :** తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నో వినూత్న పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కొనియాడారు. జడ్చర్లలో మాజీ ముఖ్యమంత్రి, జనహృదయ నాయకుడు డా.వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనిరుధ్ రెడ్డి పాల్గొని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి నాయకత్వం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ప్రజాప్రయోజన పథకాలు కోట్లాది మందికి మేలు చేశాయనీ, ప్రతి నాయకుడు వైయస్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత నేత రైతు బాంధవుడు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి న్యూ బస్టాండ్ సమీపంలోని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిళా నాయకురాలు ఎన్ఎస్‌యు నాయకులు యువ నాయకులు అందరు పాల్గొని ఆ మహనీయుడు సేవలను తీసుకొచ్చిన పథకాలను గుర్తుచేసుకొని నివాళులర్పించారు.

# కృష్ణ జలాలకు ప్రత్యేక పూజలు...

- ప్రతి గుంటకు సాగునీరు అందించడమే లక్ష్యం...
- కల్వకుర్తి లిఫ్ట్ మోటర్ ఆన్ చేసి నీటిని విడుదల చేసిన మంత్రి జూపల్లి



కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



ఎల్లూరు పంప్ హౌస్‌లో మోటార్‌ను స్విచ్ ఆన్ చేస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 8 ప్రభాతవార్త:** గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎల్లూరు గ్రామంలోని రేగుమాన్‌గడ్డ వద్ద మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టిన ఎల్లూరు పంప్ హౌస్‌లో మోటర్‌ను స్విచ్ ఆన్ చేసి కృష్ణమ్మకు పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. ఎంజీఎల్ఐ ప్రాజెక్ట్ లో భాగంగా ప్యాకేజీ 28, 29, 30 క్రింద ఉన్న ఎల్లూరు, సింగోటం, జొన్నల బొగుడ, గుడిపల్లిగట్టు జలాశయాలను నింపి ఆయకట్టు అవసరాలకు అనుగుణంగా సాగునీటిని విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి కూడా ప్రాజెక్టలను పూర్తి చేయలేకపోయిందని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాగితాలపై జిల్లా ఆయకట్టును 4.60 లక్షల ఎకరాలకు పెంచారు తప్ప నీటి విడుదలకు అవసరమైన పనులు చేపట్టలేదని తెలిపారు. కాలువల్లో నీటి ప్రవాహ సామర్థ్యం పెంచలేదని, మోటర్లు ఏర్పాటు చేయలేదని, 5 మోటర్లలో 2 మోటర్లు కాలిపోయిన పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఈ జిల్లా ప్రాజెక్టలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అప్పటి సీఎం కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావును ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పుడు సాగునీటి ప్రాజెక్ట్ లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేతల అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని వెల్లడించారు. పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి చివరి ఆయకట్టుకు నీరందస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, డా.రాజేష్ రెడ్డి, మెఘారెడ్డి, సీఈ విజయభాస్కర్ రెడ్డి, ఎస్ఇ సత్యనారాయణ రెడ్డి, ఈఈలు శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ ప్రభు, చంద్రవేఖర్, మరళీ, తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణమ్మ పరుగు

## పరుగునా సాగర్‌కు..

- శ్రీశైలం 4గేట్లు ఎత్తివేత
- కృష్ణమ్మకు జలహారీతి ఇచ్చి గేట్లు ఎత్తిన ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 8, ప్రభాతవార్త:** శ్రీశైలం ప్రాజెక్టు 4 గేట్లు తెరుచుకున్నాయి. కర్ణాటక నుంచి కృష్ణా నదికి భారీగా వరద జలాలు రావడంతో జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు గత నెల రోజుల నుంచి దాదాపుగా ప్రతిరోజు నీళ్లు వచ్చి చేరుతున్నాయి. దీంతో ప్రాజెక్టు నీటిమట్టలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగుల గాను ప్రస్తుతం 885 అడుగులకు చేరుకొంది. ఇక నీటి నిల్వలు 215 టీఎంసీలకుగాను 199టీఎంసీలకు చేరుకున్నాయి. ఇంకా ఎక్కువ నుంచి ఇన్‌ఫ్లో రావడంతో పాటుగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో శ్రీశైలం రిజర్వాయర్ గేట్లలో ఎత్తేందుకు అధికారులు నిర్ణయించారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మధ్యాహ్నం కృష్ణమ్మకు జలహారతితో 4 గేట్లను ప్రారంభించారు. ప్రాజెక్టు నాలుగు గేట్లను 10అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా భారీ ఇన్ ఫ్లోతో ఏపీలోని పోతిరెడ్డిపాడుతో పాటుగా తెలంగాణలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి నీళ్ల విడుదల చేస్తున్నారు. అలాగే కుడి ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలకు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. జూలై 29న ప్రాజెక్ట్ గేట్లు ఎత్తగా ఈసారి 21 రోజుల ముందే గేట్లను తెరవనుండటం గమనార్హం. జూలై మొదటి వారంలోనే గేట్లు ఎత్తడం గత పాతి కేళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రస్తుతం ప్రాజెక్టుకు జూరాల సుంకేసుల నుంచి ఒక లక్ష 94వేల క్యూసెక్కుల నీళ్లు వచ్చి చేరుతున్నాయి. విద్యుత్ ఉత్పత్తితో పాటుగా కల్వకుర్తి పోతిరెడ్డిపాడు రిజర్వాయర్లకు మరియు నాగార్జునసాగర్ కు లక్ష 6వేక్యూసెక్కుల నీళ్లు తరలి వెళ్తున్నాయి. మొత్తం మీద శ్రీశైలం ప్రాజెక్టు కృష్ణా నది నీటితో కళకళలాడుతోంది. గేట్లు తెచ్చుకోవడంతో ప్రాజెక్టు మరియు నల్లమల అడవి పర్యాటక శోభను సంతరించుకోనుంది.

# ప్రతి ఎకరాకు సాగునీరు..

- ఏదుల నుంచి కెఎల్ఐకి లింకు కెనాల్ ఏర్పాటు
- జంగమయ్యపల్లి ఈదుల చెరువుకు అనుసంధానం
- రూ.78 కోట్లతో బుద్ధారం స్టేజ్ టు రిజర్వాయర్ ఏర్పాటు
- గొల్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి,జూలై8 ప్రభాతవార్త :** రానున్న కాలంలో వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణబద్ధమై ఉందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.మంగళవారం ఎల్లూరుపంప్ హౌస్‌వద్ద ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతలమోటార్లను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేష్‌రెడ్డి,కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి మోటార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడు తూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల వలన వనపర్తి నియోజకవర్గంలోని ఏ ఒక్క ఎకరాకు సాగునీరు అందడం లేదని,ఏదుల రిజర్వాయర్కు సంబంధించి లింకు కెనాల్ నేటి వరకు పూర్తి కాలేదన్నారు. ఏదుల రిజర్వాయర్ నుంచి వనపర్తి నియోజకవర్గం పరిధిలోని కెఎల్ఐ కెనాల్‌కు లింకు కాలువలను ఏర్పాటు చేస్తే సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.త్వరలోనే నియోజకవర్గపరిధిలోని రూ. 78కోట్లతో బుద్ధారం స్టేజ్2 రిజ ర్వాయర్,గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని,అదేవిధంగా డి8,డి5 కాలువలను వెడల్పు చేసేందుకు నివేదికలు తయారుచేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకై అందరం కృషి చేద్దాం...**

అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధనకోసం ప్రతి ఒక్కరం కృషిచేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నివాళి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి నిరుపేదలకు ఉపయోగపరమైన ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదలను ఆదుకున్నారని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు, ఆయా మండలాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మహిళల ఆర్థిక

## అభివృద్ధికి బాటలు

- వరంగా మారిన ఇందిరా మహిళా శక్తి పథకం ..
- మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**అచ్చంపేట,జూలై 8 ప్రభాతవార్త:** మహిళా సాధికారత లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రభుత్వం మహిళల అభివృద్ధికి బాటలు వేస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. దానిలో భాగంగా ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలందరినీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళలను కోటీశ్వర్లు చేయాలని లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టారని,స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు చేయితనందిస్తుందన్నారు.మహిళలకు అనువైన ఆర్థిక ఎదుగుదలకు దోహదపడే కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశపెడుతున్నది... ఈ కార్యక్రమంలో సిబిఎం ట్రస్ట్ చైర్పర్సన్ డా.చిక్కుడు అనురాధ,జిల్లాగ్రంథాలయ సంస్థచైర్మన్ రాజేందర్, మున్సిపాలిటీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజితమల్లేష్,కౌన్సిలర్ సునీతరెడ్డి, మెప్మ అధికారులు, మహిళా సంఘాల అధ్యక్షులు,సభ్యులు,నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

### మహిళల ఆర్థికాభివృద్ధికి

## ప్రభుత్వం కృషి

**అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ విజయేంద్రబోయి**



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**జడ్చర్ల, జూలై8, ప్రభాతవార్త :** మహిళలు ఆర్థికాభివృద్ధి సాధనకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు.మంగళవారం జడ్చర్ల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎం.పి.డి.ఓ కార్యాలయంలో నిర్వహించిన మహిళా శక్తి సంబరాలు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకుమహిళా శక్తి సంబరాలు ఈనెల 12 నుంచి 18వరకు నియోజకవర్గస్థాయిలో జిల్లా ఇన్చార్జి మంత్రి,శాసన సభ్యులు సూచనలు సమన్వయంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా శక్తి సంబరాలు కార్యక్రమంలో బాగంగా మంగళవారం జిల్లాలో అన్ని మండలంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిర మహిళాశక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు,నేడు బుధవారం గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళాశక్తి సంబరాలు మహిళల నైపుణ్యాలను ప్రదర్శించే అద్భుత వేదిక అని పేర్కొన్నారు.ఈకార్యక్రమం నిర్వహణతో మహిళా సాధికారతకు దోహదపడుతుందని తెలిపారు. మండల మహిళా సమాఖ్య నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక మహిళలకు వ్యాపారాలు నిర్వహణ, ఆర్థికాభివృద్ధికి దోహదపడు తుందని తెలిపారు. అందులో సెర్ప్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు మహిళలు సాధించిన ప్రగతి మరియు మహిళా శక్తి కార్యక్రమంలో ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి వివిధ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఫిష్ ఔట్ లెట్, మహిళా శక్తి, బస్సులు, సౌర శక్తి ప్లాట్లు ద్వారా విద్యుత్ సరఫరా, పెట్రోల్ బంకులు, వ్యవసాయ పనిముట్లు, పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ తయారు, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులు మొదలగు కార్యక్రమాలను మహిళల ద్వారా అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళల సాధికారత అన్ని సమావేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మహిళలను చైతన్యం చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డి.అర్.డి.ఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### ఆసుపత్రి పనులను వేగవంతం చేయాలి

## నాణ్యతను పాటించాలి

**తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**మక్తల్ టౌన్, జూలై 8 ప్రభాతవార్త:** మక్తల్ నియోజక వర్గం అభివృద్ధిలో భాగంగా సుమారు రూ. 50 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్నటువంటి 150 పడకల ఆసుపత్రి పనులను పర్యవేక్షించిన తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించారు. మక్తల్ నియోజవర్గ అభివృద్ధి ధ్యేయంగా అందులో భాగంగా నూతనంగా నిర్మిస్తున్నటువంటి 150 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పర్యవేక్షించి అనంతరం పనుల్లో నాణ్యతను పాటించాలని పనులు వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ యజమానులకు, సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రితోపాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట సురేష్ గుప్తా, క్రిష్ణ మూర్తి, వాకిటి శ్యామ్,మీస్కిన్ నాగరాజు, నూరోద్దీన్ ,కావలి ఆంజనేయులు, గాయత్రి అనిల్, హాసమోద్దీన్, వేణుగౌడ్, వాకిటి భాస్కర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

### రబ్బర్ చెప్పులు వేసుకున్న హరీష్ రావుకు

## వేలకోట్లు ఎలా వచ్చాయి

**వెంకటేశ్వర్ రెడ్డి ఖబర్దార్ నీ అవినీతి చిట్టా అంతా నా దగ్గర ఉంది**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర, జూలై 8 ప్రభాతవార్త:** హరీష్ రావు ఏడు సార్లు గెలిచినంత మాత్రాన పాడింది పాటగా అబద్ధాలు మాట్లాడుతుంటే చూస్తూ కూర్చోము, రబ్బర్ చెప్పులు వేసుకున్న హరీష్ రావుకు వేల కోట్లు ఎలా వచ్చాయి అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి విమర్శించారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించిన దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ, ప్రతిపక్ష నాయకుల అవినీతివిధానాలను ఖండిస్తూ, వారి వైఫల్యాలను ఎండగడుతూ పలు సందర్భాల్లో ప్రెస్ మీట్లు పెట్టడం జరిగింది. నిన్న పాలమూరుకు నీళ్లు ఇచ్చామని హరీష్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతుంటే, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడిగా ప్రజలకు గణాంకాలతో సహా వాస్తవాలకు తెలియజేస్తూ మాట్లాడడం జరిగింది. వాస్తవాలు మాట్లాడితే భూజాలు తడుముకుని, హౌలా వెంకటేశ్వర్ రెడ్డి నిన్న ప్రెస్‌మీట్‌లో కల్లు తాగిన కోతిలా మాట్లాడారు. ఆల వెంకటేశ్వర్ రెడ్డి హరీష్ రావులు పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు కాంట్రాక్ట్ వర్క్‌లలో వ్యాపార భాగస్వాములు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2004 నుంచి 2014 వరకు ఏపీ అక్రమంగా 770 టీఎంసీలు కృష్ణా జలాలు తీసుకపోగా, 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలనలో ఏపీ ప్రభుత్వం ఏకంగా 1,225 టీఎంసీల నీళ్లు అక్రమంగా తీసుకుపోయినట్లు ఆధారాలతో సహా మాట్లాడితే, దానికి సమాధానం చెప్పకుండా ఎదురు దాడి చేస్తే భయపడే వారు ఎవ్వరు లేరు. మీరు చేసింది ఒక తప్పు కాదు,100 తప్పులు, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్కో బిఆర్ఎస్ ఎమ్మెల్యే వందల ఎకరాలు, వేలకోట్లు దోచుకున్నారు. బిఆర్ఎస్ దోపిడీని ప్రశ్నిస్తే, హీనాతి హీనంగా, ప్రెస్ మీట్‌కు తాగొచ్చినోడిలా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడిండు అన్నారు. బిడ్డ ఆల వెంకటేశ్వర్ రెడ్డి 2014 ముందు నీ ఆస్తులెన్ని, ఇప్పుడు నీ ఆస్తులు ఎన్ని? నీకు జూబ్లీహిల్స్ బంగ్లా, హైవే వెంబడి వేల ఎకరాల భూములు నీకు ఎక్కడి నుండి వచ్చినాయి. బిడ్డ వేంకటేశ్వర్ రెడ్డి ఖబడ్దార్,నీఅవినీతి చిట్టా అంతా నా దగ్గర ఉంది, ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు. నిస్వార్థంగా ప్రజలకు సేవచేస్తున్న మాపై అడ్డగోలుగా మాట్లాడితే తాటా తీస్తా అని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ ముసుగులో రెండుసార్లు గఫ్లాత్‌లో ఎమ్మెల్యేగా గెలిచింది నువ్వు, ప్రజల సమస్యల పై పోరాటం చేసి, మిమ్మల్ని సవాల్ చేసి, ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచా. ఒక్క ఓటుతో గెలిచిన గెలుపు,గెలుపే, మీ చిన్న దొర కేటీఆర్ 2009 లో మొదటిసారి ఎమ్మెల్యేగా 171 ఒక్క ఓట్లతో గెలిచాడు. అయినా మీ కేటీఆర్, మీ హరీష్‌రావులకు ఏమ్ అర్హత ఉందని... దేశం కోసం ప్రధానమంత్రి పదవితో పాటు ఆస్తులను అర్పించిన త్యాగధనుల కుటుంబానికి చెందిన ఇందిరా గాంధీని, రాహుల్ గాంధీని విమర్శిస్తారు? హరీష్ రావు ఏడు సార్లు గెలిస్తే ఏంటి, పది సార్లు గెలిస్తే ఏంటి, ఎమ్మెల్యేగా నాకు ప్రశ్నించే హక్కు ఉంది. నాకే కాదు, మా సామాన్య కార్యకర్తలు కూడా కేటీఆర్, హరీష్ రావు, కెసిఆర్ లను విమర్శించే హక్కు ఉంది.హరీష్ రావు, కేటీఆర్‌లను మేము కాదు సొంత చెల్లె కవిత - మిగతా4లో..

### జూరాలకు లక్షా 25 వేల

## క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**- 14గేట్ల ద్వారా దిగువకు..**

**మహబూబ్‌నగర్‌బ్యూరో, జూలై 8, ప్రభాతవార్త:** ప్రియదర్శిని జూరాల డ్యామ్‌కు వరద క్రమంగా పెరుగుతున్నది. ఎగువ ప్రాంతం కర్ణాటక నుంచి వరదపోటెత్తడంతో నిండుకుండను తలపిస్తున్నది.దీంతో 14గేట్ల ద్వారా దిగువన శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల కొనసాగుతున్నది.మంగళవారం జూరాలకు 1,25,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల కెపాసిటీ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.245 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 29,053 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 94,962 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. అదేవిధంగా బీమాలిఫ్ట్-1కు 1,300 క్యూసెక్కులు,కోయిల్‌సాగర్ లిఫ్ట్‌కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, ఎడవ కాలువకు 550, క్యూసెక్కులు, కుడి కాలువకు 285 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,26,844క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

## నేరాల నియంత్రణలో వాహనాలను తనిఖీలు


వాహనాలను తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్ ఐ బాలచంద్రుడు

**గద్వాలటౌన్, జూలై 8, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సంఘాల పార్క్ దగ్గర గద్వాల ట్రాఫిక్ ఎస్ ఐ బాలచంద్రుడు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. నేరాల నియంత్రణలో భాగంగా గద్వాల జిల్లా కేంద్రంలోని సంఘాల పార్కు, వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నేరాలను నియంత్రించేందుకు వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పంపుతున్నామని, అనుమాన స్పదంగా వున్న వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనాలలో చట్టవిరుద్ధమైన పనులను చేపట్టారాదని, వాహనాలలో క్యాపాసిటికి మించి ప్రయాణం చేయరాదని సూచించారు. వాహనాల తనిఖీలలో భాగంగా ట్రాఫిక్ ఎస్ఐ తో పాటు వారి సిబ్బంది విష్ణు, రమేష్, రామకృష్ణ, శీను, సుధాకర్,సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి సమ్మెను జయప్రదం చేయాలి

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య**

**జడ్చర్ల, జూలై8, ప్రభాతవార్త:** నేడు నిర్వహించే సార్వత్రిక సమ్మెనే విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య కోరారు. జడ్చర్లలోని ఐకెపి వివోఏ సమావేశంలో తెలుగు సత్తయ్య మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ల ను ఎత్తివేయాలని, కనీస వేతనం 26 వేలు నిర్ణయించాలని, 8 గంటల పని దినాన్ని కేంద్ర ప్రభుత్వం తో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎత్తివేసింది 10 గంటలు 12 గంటలు పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది,కార్మికులపై ఒత్తిడి చేస్తుంది కార్మికుల రక్త మాంసాలను ముద్దలుగా చేసుకొని యాజమాన్యాలకు ప్రభుత్వాలు, అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున నేటి సమ్మెకు పెద్ద సంఖ్యలనో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సిఐటియు ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, ఐకెపి వివో ఏ అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా నాయకుడు రమేష్, వాస్యాబేగం రమాదేవి, జయమ్మ, సరిత, విజయ, లక్షి ్మ రమణ ఈశ్వరమ్మ మంజుల బాలమణి నాగమణి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు .

## మండల మహిళా సమాఖ్య భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ

**ఉప్పునుంతల,జూలై 8 ప్రభాతవార్త :** స్థానిక ఇందిరా క్రాంతి సమావేశపు హాలులో మంగళవారం మండల మహిళా సమాఖ్య భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ మోహన్ లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి జరగనున్న ఇందిరా మహిళ శక్తి సంబరాలను విజయవంతం చేయాలని, మహిళా సంఘాల సామాజిక ఆర్థిక అంశాలపై పలు సూచనలు సలహాలు అందించారు. ఈ ప్రత్యేక సమావేశంలో ఎంపిడిఓ మోహన్‌లాల్, సమాఖ్య అధ్యక్షురాలు లలితమ్మ, జిల్లా అధికారి చెన్నయ్య, ఐకెపి ఎపిఎం తిరుపతయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్, గ్రామ సంఘాల అధ్యక్షురాలు,విఎఓలు , సిసిలు అంతయ్య, మల్లేష్, జై హిందు, గోపాల్, రాజు,సిబిఓ ఆడిటర్ రామకృష్ణ, ఐకెపి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## పీయూలో ఎఫ్‌డీపీ ప్రోగ్రాం


చర్చలో పాల్గొన్న వీసీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్,అధ్యాపక బృందం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై8, ప్రభాతవార్త:** జూలై 28 నుండి ఆగస్టు 4 వరకు పాలమూరు విశ్వవిద్యాలయంలో బీఈడీ కళాశాలల అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) నిర్వహిస్తున్నామని విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదేర్ల కరుణాకర్ రెడ్డి తెలిపారు. అమెరికాలోని నార్త్ డామ్ యూనివర్సిటీ వారి గ్లోబల్ సెంటర్ ఫర్ ది డెవలప్మెంట్ ఆఫ్ ది వోల్ చైల్డ్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని దీనిని పాలమూరు విశ్వవిద్యాలయం అనుబంధ బిఈడి కళాశాల అధ్యాపకులు అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా పూర్వ ఉపాధ్యాయ శిక్షణ నిర్వహణలో అధ్యాపకులకు ఉపయోగపడుతుందన్నారు. విద్యా కళాశాలల అధ్యాపకులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాణ్యమైన విద్యను అందించడానికి ఉపయోగపడుతుందన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం నార్త్ డామే యూనివర్సిటీ తో ఎంఓయూ చేసుకోవడం ద్వారా పాలమూరు విశ్వవిద్యాలయం లోని బీఈడీ విద్యార్థుల్లో విద్యా నాణ్యత పెంపొందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమానికి సంబంధించిన విధివిధానాలు పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి ఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబుతో చర్చించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ శాలిని, రుబీనా ఫిలిప్, హెచ్ఓడీ డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ బషీర్ అహ్మద్, డా జంగం విశ్వనాథ్, డా విజయలక్ష్మి పాల్గొన్నారు.

## డ్రగ్స్ మహమ్మారిపై పెబ్బేరు కళాశాలలో అవేర్నెస్ క్యాలెండర్ విడుదల


కార్యక్రమంలో పాల్గొని క్యాలెండరును ఆవిష్కరిస్తున్న దృశ్యం

**పెబ్బేరు, జులై 8 ప్రభాతవార్త :** పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సిబ్బంది డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులతో కలిసి క్యాలెండర్ విడుదల చేయడం జరిగింది. పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కౌన్సిలర్ సి.కృష్ణయ్య, హార్ట్ ఫుల్ నెస్ ప్రోగ్రాంలోని అంశాలు, డ్రగ్స్ అవేర్నెస్‌పై విద్యార్థులకు వివరించడం జరిగింది.డ్రగ్స్ యువత జీవితం నాశనంచేస్తుంది,మారక ద్రవ్యాలు జోలికి వెళ్ళకూడదని, గంజాయికి,మత్తు పదార్థాలకు,ఎవరు కూడా బానిస కాకూడదని, అనవసరంగా ప్రాణాలు కోల్పోవద్దని, కొందరు వ్యక్తులు కల్తీకల్లు (ఆల్ఫా జోలం, డైజో ఫార్మ్ ) తాగుతుంటారు అలా తాగిన వారు, దానికి బానిసలైన పౌరుల బాడీపార్ట్స్, బ్రెయిన్, హార్ట్,లివ ర్,కిడ్నీస్,లంగ్స్ ఎలా శరీర భాగాలు చెడిపోతాయో,ఎలా కల్తీకల్లుకు బానిసలైతే ఎలా ప్రాణాలు పోతాయో విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. మంచి ఆహారం తీసుకొని, మంచి ఆరోగ్యం కాపాడుకోవాలని విద్యార్థులు తెలియజేశారు,భావి భారతపౌరులైన మీరు ఎవరు కూడా డ్రగ్స్ జోలికి వెళ్ళకూడదు అని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్‌కుబానిసై,గంజాయి ఇతర మత్తుపదార్థాలు,దొరికే వారి వివరాలు ఉన్న, అమ్ముతున్నారని వారి సమాచారం ఉంటే బాధ్యతాయుతమైన పౌరులుగా, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు ఫోన్ చేయాలని విద్యార్థులకు సూచించడం జరిగింది. మంచి ఆరోగ్యం,మంచి అలవాట్లపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది.డ్రగ్స్ క్యాలెండర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ఓబుల్ రెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ సి.కృష్ణయ్య ,అధ్యాపకులు,జ్ఞానేశ్వర్ రెడ్డి, నవీన్ కుమార్,రవీందర్,జాకీర్ హుస్సేన్, వెంకటలక్ష్మి, శిల్ప, బోధనేతర సిబ్బంది కరుణాకర్, వెంకటేష్,మధు,వెంకట్ రాములు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ల్యాప్ ట్యాప్ అప్పగించిన ఎస్సై


ల్యాప్‌ట్యాప్‌ను అందిస్తున్న ఎస్ఐ

**కల్వకుర్తి, జూలై 8 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణానికి చెందిన సిమ్కో కంప్యూటర్ ఇన్సిట్యూట్ యజమాని బల్వంత్ రెడ్డి యొక్క ల్యాప్‌టాప్ పోయినట్లు కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కల్వకుర్తి పోలీస్‌స్టేషన్ క్రైమ్ పార్టీ కానిస్టేబుల్స్ చిరంజీవి, నజీర్ ల్యాప్‌టాప్‌ను వెతికి యజమాని బల్వంత్‌రెడ్డి కి స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎస్సై మాధవరెడ్డి అందించారు. మిస్ అయిన ల్యాప్‌టాప్ ఆచూకీ తెలుసుకున్న విషయంలో క్రైమ్ పార్టీ పోలీస్ కానిస్టేబుల్స్ అయినటువంటి చిరంజీవి, నజీర్‌లను ఎస్ఐ మాధవరెడ్డి అభినందించారు.

# టీబీజీకి చేయూతనిస్తాం..

**- గార్డెన్ నిర్వహణ అద్భుతం..పరిశోధనలకు ఊతం.. - మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి**


మొక్కను నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి


టీబీజీలో కలెక్టర్ విజయేందిర బోయి

**జడ్చర్ల, జూలై8, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం జడ్చర్ల లోని డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ను సందర్శించారు. వీరికి కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డా. నర్మద స్వాగతం పలికారు. కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్న బీఎల్‌వో ట్రైనింగ్ ను ఆమె సందర్శించారు. కలెక్టర్ అనంతరం డిగ్రీ తృతీయ సంవత్సరం బీ.జెడ్‌సీ తరగతి గదిలోకి ప్రవేశించి కాసేపు అధ్యాపకురాలిగా మారారు. విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలగిడి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ, స్వయం ఉపాధి, అనుకున్న విజయాలను ఎలా చేరుకోవాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ ల్యాబ్, స్వయం రక్షణ కోసం కరాటే లాంటి విద్యలు, పోటీ పరీక్షలు ముఖ్యంగా సివిల్స్, గ్రూప్స్ ప్రిపరేషన్ కు కావలసిన వసతులను ఏర్పాటు చేస్తామని అదేవిధంగా విద్యార్థులకు డ్రైవింగ్ నేర్చుకోవడానికి అవకాశం కల్పిస్తామని తెలియజేశారు. అనంతరం కళాశాలలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. మొదటగా గార్డెన్‌కు అనుబంధంగా ఉన్న జీవవైవిధ్య పరిరక్షణ మరియు విద్యాకేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్‌కు గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య మొక్కతో స్వాగతం పలికారు. అనంతరం అక్కడ నిల్వజేసిన ఇటీవల రక్షించిన పాములను చూశారు. తరువాత బొటానికల్ గార్డెన్ లో వివిధ విభాగాలను పరిశీలించి మొక్కను నాటి నీరు పోశారు. గార్డెన్ ఏర్పాటు చేసిన తీరును అభివృద్ధి చేస్తున్న సదాశివయ్యను అభినందించారు. గార్డెన్‌కి కావలసిన సహాయ సహకారాలు చేస్తామని తెలిపారు. గార్డెన్‌లో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న నెట్ హౌస్ లను, ఆర్కిడ్ హౌస్, కాక్టస్ హౌస్ లను చూసి కలెక్టరేట్ ఆవరణలో ఇలాంటివి ఏర్పాటు చేయాలని సదాశివయ్య కు సూచించారు. కలెక్టర్‌కు గార్డెన్‌లో పండిన స్టార్ ఫ్రూట్స్‌ను గార్డెన్ సమన్వయకర్త, ఇంచార్జి ప్రిన్సిపాల్ డా.నర్మద బహుమానంగా అందించారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సి6 డా. నర్మద, అధ్యాపకులు డా. సదాశివయ్య, రాఘవేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, రాజేశ్వరి, వెంకట్ రెడ్డి, రజనీ ఉన్నారు.

# మాజీ ఎమ్మెల్యే మతిభ్రమించి మాట్లాడుతున్నారు

**విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతల ఆగ్రహం**


విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

**చిన్నచింతకుంట, జూలై 8 ప్రభాతవార్త :** దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధిని అంకితభావంతో పనిచేస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పై మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్ సుధాకర్ రెడ్డి, విండో చైర్మన్ సురేందర్ రెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారని వారు దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో గ్రామ అభివృద్ధికి సొంత డబ్బులను ఖర్చు చేసిన సర్పంచులకు బిల్లులు కూడా ఇవ్వలేదని వారి ఆస్తుల అమ్ముకొని అప్పులు కట్టుకున్నారని, మాజీ ఎమ్మెల్యే మాత్రం తాను నిర్మించిన ప్రాజెక్టులు, చెక్ డ్యాముల బిల్లులు మాత్రం పూర్తిగా తీసుకున్నారని, సర్పంచులను మాత్రం బిచ్చగాళ్లగా మార్చారని వారు విమర్శించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాభిమానం ఉన్నవాళ్లే గెలుస్తారని దీనిపై అవగాహన లేకుండా మా ఎమ్మెల్యేను గప్లత్ అనడం మాజీ ఎమ్మెల్యేకు సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెలలోనే కోయిల్ సాగర్‌కు ఉంద్యాల ఫేస్ 1 నుంచి పంపుల ద్వారా దేవరకద్ర, మక్తల్ ఎమ్మెల్యేలు నీటిని విడుదల చేశారని రైతు సంక్షేమానికి ప్రజాప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వారు గుర్తు చేశారు. 10 సంవత్సరాలలో చేయని అభివృద్ధిని ఈ 18 నెలల్లో శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం పైకి ఎలిమినేటర్ కారిడార్ నిర్మాణానికి 110 కోట్ల రూపాయలు మంజూరు చేశారని, జాతర మైదానంలో 32 లక్షలతో నీటి నిల్వ సంపును నిర్మించామని, 60 కోట్ల అభివృద్ధి పనులకు గాను ప్రతిపాదనల ను పంపించారని నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతూ మా ఎమ్మెల్యే జిఎంఆర్ ముందుకు సాగుతున్నారని వారు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని ప్రతిరోజు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పర్యటిస్తున్న మా ఎమ్మెల్యే పై మాజీ ఎమ్మెల్యే విమర్శించడం మానుకోవాలని అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరింత అభివృద్ధి చేసేందుకు అంకితభావంతో పనిచేస్తుందన్నారు. మరోమారు మా ఎమ్మెల్యే పై మాజీ ఎమ్మెల్యే విమర్శలు చేస్తే ఊరుకోమని అడుగడుగునా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.ఈ సమావేశంలో నాయకులు ప్రతాప్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, ఎస్ వెంకటేష్, మాజీ కోఆప్షన్ మహమూద్, గంజి బాలరాజ్, మొగిలన్న ,జాకీర్,వజీర్ బాబు, శ్రీనివాస్ గౌడ్, ప్రతాప్, గూడూరు శేఖర్, అశోక్, అహ్మద్, పెంటన్న, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు : బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి


ఆత్మకూర్ పట్టణంలో బిజెపి కార్యకర్తను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న లక్ష్మీకాంత్ రెడ్డి

**ఆత్మకూర్ జూలై 8, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలుగా పనిచేస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొత్తం నియోజకవర్గ ఇన్చార్జి బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణానికి చెందిన వడ్డే వెంకటన్న ఇటీవల ప్రమాదానికి గురైన విషయాన్ని తెలుసుకుని ఆయన ఆత్మకూర్ పట్టణంలోని బాధితులు ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గం లో ఏ కార్యకర్తకు ఆపద వచ్చినా ఆదుకునేందుకు తాను ఎల్లవేళలా ముందుంటానని పేర్కొన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో అత్యధిక స్థానాలలో విజయం సాధించి మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మకు కానుకగా ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు కార్యకర్తలకు ఎటువంటి ఆపద ఎదురైన ఆదుకునేందుకు నాతోపాటుగా పార్లమెంట్ సభ్యురాలు ఎల్లవేళలా ముందుంటారన్నారు. ఆత్మకూరు పట్టణంలో గత కొన్ని రోజులుగా అధికార పార్టీ నాయకులు బిజెపి పై తప్పుడు ప్రచారం చేస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు అనుబంధంగా మరో కొత్త వంతెన ఏర్పాటు విషయంలో మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు చేసిన కృషిని మక్తల్ నియోజకవర్గం ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు అనంతరం బాధితు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి మనోధైర్యం చెప్పారు ఈ కార్యక్రమంలో బిజెపి ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షులు అశోక్ భూపాల్ యాదవ్ ప్రధాన కార్యదర్శిలు ఎల్లన్న తమ్మలి విజయ్ బిజెపి నాయకులు మండల సూరి ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్గౌడ్ స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**-ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన నాగర్‌కర్నూల్ ఇంచార్జ్ డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రామకృష్ణ**


ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఇంచార్జ్ డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రామకృష్ణ

**కల్వకుర్తి, జూలై 8 ప్రభాతవార్త:** ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వాసుపత్రి పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్చార్జి డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిని నాగర్‌కర్నూల్ ఇంచార్జ్ డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రామకృష్ణ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ శివరాం, వైద్యులు, నర్సింగ్ సూపర్డెంట్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్‌తో కలిసి అన్ని విభాగాల వార్డులు పరిశీలించిన అనంతరం సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి అందరూ సకాలంలో విధులకు హాజరుకావాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు, అదేవిధంగా వైద్యం కోసం వచ్చే రోగుల వద్ద గాని కాన్పు కోసం వచ్చే గర్భిణీల దగ్గర కానీ ఎవరైనా డబ్బులు తీసుకుంటున్నట్టు మా దృష్టికి వస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొని వారిని విదుల నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. రిఫరల్ ప్రోటోకాల్ ప్రకారమే పెద్ద ఆసుపత్రికి రోగులను రెఫర్ చేయాలని కోరారు. రాష్ట్రంలో వైద్య సేవలలో ముందంజలో ఉన్న కల్వకుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం పేరును అలాగే కొనసాగించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు యశోద, వసంత దేవి, విజయకుమార్, షకీల్, పాండురంగ, ఉదయ్, స్వప్న, శిరీష మరియు నర్సింగ్ సూపర్డెంట్ శిరోమణి సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ బాలమణి, జయ మెర్సి, సునీత పాల్గొన్నారు.

# వైఎస్ ఆశయాలను కొనసాగిద్దాం

**- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నేత :**

**ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్**

**- మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వైయస్సార్ జయంతి**



వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముడా చైర్మన్, నాయకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై8, ప్రభాతవార్త:** వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం వైయస్సార్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి ఎన్నో చారిత్రాత్మకమైన పథకాలు తెచ్చి తెలుగు ప్రజల సంక్షేమం కోసం కృషిచేశారన్నారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఉన్నత వర్గాలకు పరిమితమైన ఇంజినీరింగ్, మెడికల్ లాంటి కోర్సులను నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లించి ఎందరినో ఇంజినీ ర్లుగా, డాక్టర్లుగా తీర్చిదిద్దిన ఘనత వైఎస్ఆర్ కే దక్కుతుందన్నారు. వైఎస్ ఆర్ ఆశయాలకు కొనసాగింపుగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో విద్యార్థులు, రైతుల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు వివరించారు. రైతు రుణమాఫీ, పేద విద్యార్థులకు ఫీజు రీయంబ ర్సుమెంట్, పేదలకు ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. వైఎస్ఆర్ ఆశయ సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని కోరారు.. కార్యక్రమంలో డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్ అహ్మద్ , నాయకులు కంచిమి లక్ష్మణ్, గులాం జహీర్, పీర్ సాదిక్, బాలస్వామి, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం

**సిఐటియు, టియుసిఐ నేతల పిలుపు**


విలేకరులతో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నేతలు

**చిన్నచింతకుంట, జూలై 8 ప్రభాతవార్త :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29రకాల కార్మికుల చట్టాలను లేబర్ కోడ్‌లుగా విభజన చేసి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్న దీనికి నిరసనగా బుధవారం చేపట్టి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు ఉపాధ్యక్షులు వేణుగోపాల్ టియుసిఐ జిల్లా అధ్యక్షులు దేవదానం పిలుపునిచ్చారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలో జరుగు సమ్మెలో గ్రామపంచాయతీ,మున్సిపల్,హమాలి, భవననిర్మాణ, సోలార్ విద్యుత్, అంగన్వాడీ,ఆశ, ఫీల్డ్ అసిస్టెంట్, మధ్యాహ్నబోజన, కస్తూరిబా, ప్రభుత్వరంగంలో పనిచేసే అవుట్‌సోర్సింగ్,కాంట్రాక్టు ఉద్యోగులు,ఎల్ఐసి,బ్యాంకింగ్ కార్మిక ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

## 10న గొర్రెల సంత వేలం

**ఉప్పునుంతల,జూలై8 ప్రభాతవార్త :** 2025,26 సంవత్సరానికి గాను మండలంలోని వెల్టూరు గ్రామంలో జరుగు గొర్రెల సంత వేలం రేపు10న గురువారం ఉదయం11గంటలకు స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఉమా శంకర్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిబంధనల ప్రకారం ఉప్పునుంతల ఎంపిడిఓ మోహన్‌లాల్ ఆదేశాలమేరకు గ్రామపంచాయతీ నియమనిబంధనల ప్రకారం వేలంపాట నిర్వహించడం జరుగుతుందని వేలంపాటలో అధికసంఖ్యలో పాల్గొనాలని పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్ పేర్కొన్నారు.

## డంపింగ్ యార్డ్ హటావో బాలానగర్ బచావో


ఎంపిడిఓకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

**బాలానగర్, జూలై 8 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రానికి చేరువలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను గ్రామానికి దూరంగా తరలించాలని బాలానగర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ర్యాలీగా వచ్చి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. డంపింగ్ యార్డ్ గ్రామానికి దగ్గరలో ఉండటం వల్ల దాని నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని వారు తెలిపారు. డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే వ్యర్థాలు, విష వాయువుల నుంచి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, డంపింగ్ యార్డ్‌ను గ్రామానికి దూరంగా తరలించి, ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా కాపాడాలన్నారు.ఈకార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మధు, ప్రధాన కార్యదర్శి కరాటే రవి, దినేష్, శ్రీను, చంటి,పెద్ద ఎత్తున యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహా నేతకు ఘనంగా నివాళులు


ఉప్పునుంతలలో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పిస్తున్న నాయకులు

**ఉప్పునుంతల, జూలై 8 ప్రభాతవార్త :** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి 76 వ జయంతి వేడుకలు మంగళవారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వర్గీయ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రైతులకు ఎంతో మేలు చేశారని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మండల వర్కింగ్ మాజీ ప్రెసిడెంట్ బుషిరాజు మల్లయ్య, శ్రీ ఉమా మహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ లక్ష్మయ్య, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోడమోని భాస్కర్, బిసి సెల్ మండల అధ్యక్షుడు మద్ది తిరుపతయ్య గౌడ్, సునీల్, రత్లావత్ కృష్ణ, పాత్కుల రామచంద్రయ్య,రాందాసు, వెల్టూరి రేణయ్య, గోవింద్ సింగ్ ,గుద్దటి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలందించాలి

◆ నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట ప్రతినిధి, జూలై8 ప్రభాతవార్త:** ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెరుగుతాయని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలియజేశారు. పదోన్నతి పొందిన ఏఎస్ఐ బి.బాలస్వామి మంగళవారం ఉదయం జిల్లా యోగేష్ గౌతమ్ ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ చేతుల మీదుగా పదోన్నతి పొందినబాలస్వామికి వన్‌స్టార్‌ను అలంకరించి అభినందనలు తెలియజేసారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతుందని అలాగే పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసుల పట్ల భరోసా, నమ్మకాన్ని కలిగించడంతో పాటు, నిరుపేద ప్రజలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## టీబీ రోగులకు పోషకాహార కిట్ల అందజేత

**నవాబుపేట, జూలై 8 ప్రభాతవార్త:** నవాబుపేటపై మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య వైద్యులు డా. శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం టిబి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వారికి పోషకాహార కిట్లను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్ష ద్వారా ఇంతకుముందు టిబి నిర్ధారణ అయి ట్రీట్మెంట్ తీసుకుంటున్న వారి కుటుంబ సభ్యులకు ఈ టెస్ట్ చేయడం ద్వారా వ్యాధి సోకే ప్రమాదం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, చికిత్స ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ నిర్ధారణ పరీక్షలను 20 మంది కాంటాక్ట్ పర్సన్స్‌కు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా టిబి రోగులకు న్యూట్రిషన్ కిట్లను కూడా అందించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ టీబీ రోగులు ధూమపానము మద్యపానము దూరంగా ఉండాలని సరియైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. 2026 వరకల్లా టీబీ రహిత సమాజాన్ని ఏర్పాటు చేసుకోవడంలో అందరూ భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితోపాటు ఆశా కార్యకర్తలు టీబీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జన్మదిన సందర్భంగా అమ్మ పేరున మొక్క నాటిన విద్యార్థి

**పెబ్బేరు, జూలై 8 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం యాపర్ల ప్రాథమిక పాఠశాలలో ఎకో క్లబ్ మిషన్ లైఫ్ కార్యక్రమంలో 4వ తరగతి చదువుతున్న ధర్మతేజ పుట్టిన రోజు సందర్భంగా రేణుక, సంతోష్‌రెడ్డి దంపతులు ప్రాథమిక పాఠశాల యాపర్ల ఆవరణంలో అమ్మ కోసం ఒక మొక్క నాటడం జరిగింది. పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసే సంస్కృతిని దూరం చేస్తూ, పాయసం చేసి పిల్లలందరికి పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు బొల్లు హుస్సేన్ యాదవ్, ఉపాధ్యాయులు మురళి కృష్ణ , భాగ్యలక్ష్మి పాల్గొనడం జరిగింది. పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయుడు ఎకో క్లబ్ మిషన్ లైఫ్ వెబ్సైట్ లో నాటిన మొక్క ఫోటోను జియో ట్యాగ్ నమోదు చేసి, విద్యార్థికి సర్టిఫికెట్ అందజేయడం జరిగింది.

## క్రమశిక్షణతో కూడిన విద్యను పెంపొందించుకోవాలి

◆ జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి. రజని

**వనపర్తి క్రైమ్, జూలై8 ప్రభాతవార్త:** క్రమశిక్షణతో కూడిన విద్యను పెంపొందించుకోవాలి అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి.రజని అన్నారు మంగళవారం వనపర్తి జిల్లాలోని చింతకుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నాల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం 2024లో భాగంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎటువంటి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలను చేసి బంగారు భవిష్యత్తును కోల్పోవద్దు అని సూచించారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశమైన చట్టాలను వివరించడంలో భాగంగా పోక్సో యాక్ట్, బాల్యవివాహాల చట్టం, మోటార్ వెహికల్ యాక్ట్, బాలకార్మికుల చట్టం, సైబర్ క్రైమ్స్, గురించి తెలియజేశారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమంలో లాయర్ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు షేక్యా నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## ఉప్పునుంతలలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

**ఉప్పునుంతల, జూలై 8 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో మంగళవారం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. మాన్యశ్రీ పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ 31 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు గుడ్డటి వెంకటయ్య, ఉపాధ్యక్షులు నిరంజన్, ప్రధాన కార్యదర్శి చింతగాళ మల్లయ్య, కార్యదర్శి బర్ల చిన్న వెంకటయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చింతగాళ సుధాకర్, బొల్లె బాలయ్య, బొల్లె మహేష్, అని నడిగడ్డ శ్రీశైలం, బొల్లె వెంకటయ్య, చింతగాలబాలచంద్రయ్య, బొల్లె చిన్నవెంకటయ్య, చింతగాల రాములు, పొట్టల రేణయ్య, కాలూరి శీను, బొల్లె పరమేశు, బీపీ స్వామి, ఎమ్మార్పీఎస్ కుల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండు జెసిబిలు, మూడు ట్రాక్టర్లు పట్టివేత

**రాజాపూర్, జూలై 8 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల పరిధిలోని రాయపల్లి శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్న రెండు జెసిబిలను, మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రాజాపూర్ ఎస్ఐ శివానంద గౌడ్ తెలిపారు. అలాగే జెసిబి ట్రాక్టర్లకు సంబంధించిన రాజు, వెంకట్ సాయి, శ్రీరామ్, శ్రీను అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివానంద్ గౌడ్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తయారు చేస్తున్న వారిపై చర్యలు తప్పవని ఇసుకను తయారు చేస్తున్నారని సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని ఈ సందర్భంగా ఎస్ఐ శివానంద్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## ఉడ్‌ల్మ్‌గిద్దలో గురుదక్షిణ కార్యక్రమం

**దామరగిద్ద, జూలై 8 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం పరిధిలోని ఉడ్‌ల్మ్ గిద్ద గ్రామము లోని అంజనేయ స్వామి గుడి ఆవరణలో గురుదక్షిణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణపేట జిల్లా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ సహకార్యవాహక్ ప్రభాకర్ జి హాజరై గురుదక్షిణ కార్యక్రమం ఎందుకు నిర్వహిస్తామని చెప్పడం జరిగింది. ముఖ్యంగా ఈరోజుల్లో మన ధర్మానికి విరుద్ధంగా సంస్కృతికి వ్యతిరేకంగా సమాజం పోతున్నది. మళ్లీ మన సమాజంలో సనాతన ధర్మం గురించి పెద్దల్ని గౌరవించడం గురించి స్త్రీల పట్ల గౌరవం గురించి నేటి యువత అవలంబిస్తున్న పద్ధతులు మార్చుకొని ధర్మాన్ని కాపాడే విధంగా అందరం కలిసి కట్టుగా పనిచేసినప్పుడే దేశానికి మేలు జరుగుతుందని అన్నారు. క్రమశిక్షణతో ఏ కార్యక్రమం చేసిన విజయం సాధిస్తాం ముఖ్యంగా యువత మందు మాంసాలను వదిలి శాఖాహారము తీసుకొని జీవహింస లేని సమాజాన్ని నిర్మించాలని మహాయోగిని శ్రీశ్రీశ్రీ మాణికేశ్వరి మాత బోధించడం జరిగింది. ఆర్ఎస్ఎస్ మొట్టమొదట 1925 సంవత్సరంలో నాగపూర్ లో కేవలం ఐదు మంది స్వయంసేవకులతో ప్రారంభమై నేడుదేశవ్యాప్తంగా లక్షల శాఖలు నిర్వహించడం జరిగింది కులమత బేధాలు లేకుండా మానవులంతా ఒకే కుటుంబం మాదిరిగా వ్యవహరించాలని కోరడం జరిగింది మన ధర్మాన్ని ప్రచారం చేయుటకై ఆర్ఎస్ఎస్ లో చాలామంది బ్రహ్మచార్యులుగా తమ జీవితాలను సమాజం కోసం త్యాగం చేసి ప్రచార బాధ్యతలు చేపట్టడం జరిగింది. అలాంటి వారి కొరకు గురుదక్షిణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. గురుదక్షిణ అంటే కాషాయ ధ్వజం అనగా త్యాగానికి నిదర్శనం ప్రచారకుల కనీసఅవసరాల కోసం ఒక్కరూపాయి నుండి మొదలుకొని ఎవరి కి తోచిన విధంగా సమర్పించుకోవడం ఈ యొక్క గురుదక్షిణ కార్యక్రమం యొక్క ముఖ్యఉద్దేశం. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, లక్ష్మప్ప, హనుమంతు, భగవంతు, చంద్రశేఖర్ రెడ్డి వెంకట్ రెడ్డి గోవర్ధన్‌రెడ్డి, నరసింహులు, ఆశప్ప, భీంషప్ప పాల్గొన్నారు.

IN THE COURT OF THE XIV ADDITIONAL CHIEF JUDGE: CITY CIVIL COURT: AT HYDERABAD:
I.A.NO. 68 OF 2025
IN
I.A.NO. 233 OF 2017
IN
O.S.NO.265 OF 2009

Between:
B.Vinay Kumar Reddy and another ...Petitioners/Petitioners/Plaintiffs
And
P.Jangaiah died as per L.R's and others ...Respondents/Respondents/Defendants

NOTICE TO RESPONDENT NO. 3

To,
Ponuganti Muralidhar, S/o Late P.Jangaiah Hindu, aged about 45 years, R/o.H.No.6-118, Gandhi Nagar, Kalwakurthy Village and Mandal,Mahaboob Nagar District.

Take notice that the above-named Petitioners/Plaintiffs filed the above I.A. against Respondents/Defendants and the said case was posted to **17.07.2025** for your appearance either in person or through an Advocate, duly instructed by you otherwise the matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)

S. Syam Sunder Rao
(AP/2181/1998)
Advocate
R/o. Plot No.265/T,
Saraswathi Nagar, Saidabad
Hyderabad-500 059.
Cell: 9440476034
Counsel for the Petitioner

## నేటి సమ్మెను విజయవంతం చేయండి

**మహబూబ్‌నగర్, జూలై8, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సకల జనులంతా పాల్గొనే విజయవంతం చేయాలని కోరుతూ సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కే రవి కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, డిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవీందర్ గౌడ్, ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ చౌరస్తాలో బుధవారం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అట్టి సమ్మెకు మద్దతుగా టిఎస్‌యుటిఎఫ్, డిటిఎఫ్, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సమ్మెకు సంఘీభావంగా ప్రదర్శన నిర్వహించి మద్దతుగా మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 8గంటల పని విధానాన్ని పునరుద్ధరించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఆశాస్త్రీయ విద్యను బోధించే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక నాయకులు రాఘవాచారి, టీఎస్ యుటిఎఫ్ నాయకులు కేరవికుమార్, ఎన్ వెంకటేష్, పి. ఉమాదేవి, పి జయంతి, శంకర్‌నాయక్, ఎంరాములు, వేణుగోపాల్ వర్మ, కృష్ణయ్య, అయూబ్, డిటిఎఫ్ నాయకులు రవీందర్ గౌడ్, ప్రభాకర్, వామన్ కుమార్ వెంకటేశ్వర్లు, మల్లయ్య, రఫీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# మహిళలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు

■ షి టీమ్ పోలీసులు చెన్నయ్య



విద్యార్థులకు అవగాహన షిటీం సిబ్బంది

**నారాయణపేట టౌన్, జూలై8 ప్రభాతవార్త:** మహిళలను వేధిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని షీటీం పోలీసులు బాలరాజు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రం, గ్రౌండ్ స్కూల్ విద్యార్థులకు షిటీమ్ పోలీసులు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మహిళలను, చిన్నపిల్లలను వేధిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా షీ టీం పోలీసులు చెన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులు స్కూల్ నుండి ఇంటికి ఇంటి నుండి స్కూల్‌కి వచ్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఎవరైనా తినుబండారాలు ఇస్తే తీసుకోరాదని, ఎవరైనా వేధిస్తే విద్యార్థులకు, మహిళలకు షి టీమ్ పోలీసులు అండగా ఉంటారని మహిళలను, శారీరకంగా మానసికంగా బాధపెట్టిన ధైర్యంగా షి టీమ్ పోలీసులకు నెంబర్. 8712670398 కి సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి చట్ట ప్రకారం వేధించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాగే విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఒకవేల సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు షీ టీం పోలీసులు బాలరాజు, జ్యోతి, కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

■ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు



ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నారాయణ పేట, జూలై8 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్ దగ్గర ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలలోపు వారు, మైనర్లు వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు వారు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు, సంరక్షకులు బాధ్యత వహించాలని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని విద్యార్థులకు వాహనదారులకు సూచించారు. అలాగే వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదానికి గురై అవకాశం ఉంటుందని, జాగ్రత్తగా వచ్చే వారి వాహనాలకు కూడా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. వాహనదారులు మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపించడం జరుగుతుందిఅని తెలిపారు. వాహన దారులుకచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలుపాటించాలని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదు. వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించవలెను. వాహన దారులు మెయిన్ రోడ్డు పై వాహనాలను పార్కు చేయరాదు. టూ వీలర్స్ పై ఇద్దరకు మించి ప్రయాణించరాదు. ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను మరియు కూలీలను ఎక్కించుకోరాదు. ఆటోలో సీట్ పర్మిట్ ఉన్నంతవరకే ప్యాసింజర్ ఎక్కించుకోవాలి. డ్రైవింగ్ చేస్తూ సెల్ఫోన్ మాట్లాడరాదు. రాష్ డ్రైవింగ్ చేయరాదు. పరిమిత వేగంలో వాహనాలు నడపాలి. ప్రతిఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలని ట్రాఫిక్ కానిస్టేబుల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు నరేష్, వాహన దారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్, జూలై8 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో గల కేజీబీవీలో ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ మారుతున్న కాలం తో పాటు మోసాలు నేరాలు కూడా మారుతున్నాయి పెరిగిన టెక్నాలజీతో పాటు మోసాలు కూడా కొంత రూపాన్ని సంతరించుకున్నాయని సైబర్ నేరాలు భారీగా పెరిగిపోతున్నాయని ఈ నేరాలపై సరైన అవగాహన లేక చాలామంది బాల బాలికలు సైబర్ మోసగాళ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించడం జరిగింది. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలియజేయడం జరిగింది. ప్రస్తుతం మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో వేల కొద్ది యాప్స్ అందుబాటులోకి రావడంతో విద్యార్థిని విద్యార్థులు ఏది పడితే ఆ యాప్‌లను వినియోగించడం చేయరాదని ఆ యాప్స్ లాభం కంటే నష్టం ఎక్కువగా జరుగుతుందని వివరించడం జరిగింది. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని ఓటీపీ నెంబర్ కానీ ఆధార్ నెంబర్ గాని గూగుల్ పే ఫోన్ పే సీక్రెట్ నెంబర్లను ఇతరులకు తెలియజేయకూడదని వివరించడం జరిగింది. ఇతర వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చినట్లయితేభయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించడం జరిగింది. మొబైల్ ద్వారానే 80 సైబర్ నేరాలు జరుగుతున్నాయని. విద్యార్థులు సైబర్ నేరాలకు గురికాకుండా చుట్టూ ఉన్నసమాజాన్ని కూడా జాగృతం చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ ఎస్సై రామకృష్ణ పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# మంత్రి శ్రీహరికి డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకుల వినతి



మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, జూలై 8 ప్రభాతవార్త:** మక్తల్‌కు కొత్త పాఠశాల వచ్చిన సందర్భంలో మంత్రిని కలిసి, పాఠశాలల్లోని సమస్యలను మంత్రి వాకిటి శ్రీహరి కి వివరించి, పరిష్కారాన్ని చూపాలని డిటిఎఫ్ నాయకులు కోరడం జరిగింది. మక్తల్ మున్సిపాలిటీ కేంద్రానికి రెండు కొత్త పాఠశాలలు వచ్చాయి. మొదటిది బిసి కాలనీ, రెండవది జగ్జీవన్ రామ్ నగర్ కు ప్రభుత్వ కొత్త బదులను కేటాయించింది. ఈ పాఠశాలకోసం డిటిఎఫ్ గత కొన్ని సంవత్సరాలుగా, తన శక్తి మేరకు ప్రయత్నిస్తూనే ఉన్నది. ఈ విషయంలో మంత్రి చొరవ, జోక్యం చాలా ముఖ్యమైనది, అందుకు మంత్రికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. పాఠశాలను వచ్చిన తరువాత, ఈరోజు మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి సమస్యలను పరిష్కరించమని డిటిఎఫ్ నాయకులు కోరారు. బిసి కాలనీలో వెంటనే అన్ని సదుపాయాలు కలిగిన కొత్త పాఠశాల భవనం నిర్మించి అక్కడ అంగన్వాడి సెంటర్‌ను కూడా నెలకొల్పాలని అదేవిధంగానే జగ్జీవన్ నగర్ లో కూడా పాఠశాల భవనాన్ని నిర్మించాలని కోరారు. ఖానాపూర్ పాఠశాలలో 160 మన విద్యార్థులు ఉన్నప్పటికీ కేవలం 3 పోస్టులు ఉండగా ముగ్గురు టీచర్లే పని చేస్తున్నందున కొత్త పోస్టులను సృష్టించి విద్యార్థులకు నాణ్యమైన చదువు అందేలా ఉపాధ్యాయులనుఇవ్వాలని అన్నారు. దీనితోపాటు కృష్ణ ప్రాథమిక పాఠశాలకు భవనం లేక, ప్రస్తుతం అద్దె భవనంలో పాఠశాల నడుస్తున్నది, కనుక వెంటనే తమరు చొరవచేసి పాఠశాల భవనాన్ని చాలని, అదేవిధంగా 100 విద్యార్థులున్న ఆలంపల్లి పాఠశాలకు కూడా సరిపడా భవనాన్ని నిర్మించి ఇవ్వలని అన్నారు. కృష్ణా మండలంలోని గురజాల పాఠశాలలో 59 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ కూడా, ఒకే ఒక గదితో పాఠశాల నడుస్తున్నదని వర్షా కాలంలో చాలా సమస్యాత్మకంగా ఉంటున్నందున ఈ పాఠశాలకు సైతం నూతన భవనాన్ని నిర్మించి ఇవ్వాలని కోరారు. దానికీ మంత్రి స్పందిస్తూ బీసీ కాలనీకి రెండు దశాబ్దాలుగా పాఠశాల లేని విషయాన్ని ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకున్న మంత్రి వాకిటి శ్రీహరి స్వయంగా ఆ ప్రాంతాన్ని సందర్శిస్తానని, నిధులను కేటాయిస్తానని అన్నారు. అంతేకాకుండా 10 సంవత్సరాలకు వ్యవస్థలన్నీ ధ్వంసం అయ్యాయని, ఈ మూడు సంవత్సరాల్లో అన్నిటిని పరిష్కరిస్తారని, మీరు చెప్పిన సమస్యల్ని తప్పక పరిష్కరిస్తానని హామీని ఇచ్చిన విషయాన్ని, ప్రజలతో, ఉపాధ్యాయులతో పంచుకుంటున్నామని అన్నారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసిన వాళ్లలో డిటిఎఫ్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర. జిల్లాఅధ్యక్షురాలు హైమావతి, జిల్లా కార్యదర్శి శ్రీవిద్య, మక్తల్ మండల ఉపాధ్యక్షులు అశోక్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన అమలు చేయాలి

◆ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పాపన్నగౌడ్



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పాపన్నగౌడ్

**నారాయణపేట టౌన్, జూలై 8 ప్రభాతవార్త :** రాష్ట్రంలో పసల్ బీమా యోజన అమలు చేసి ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలని కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పాపన్న గౌడ్ అన్నారు. మంగళవారం నారాయణపేట మండలంలోని సింగారం గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఫసల్ బీమా యోజనతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. రైతు భరోసా కూడా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే వేసిందని తర్వాత వేయదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా కిసాన్ సమ్మాన్ నిధి పేరిట ప్రతి సంవత్సరం 3విడుతలు రైతుల అకౌంట్లలోకి డబ్బులు వేస్తుందని చెప్పారు. ఎరువుల విషయంలో కూడా కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని కృత్రిమ కొరత సృష్టించి రైతులను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. రాష్ట్రలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి లేదన్నారు. రైతులకు ఇస్తామన్న 500 బోనస్ వెంటనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి, కిరణ్, గోవర్ధన్‌గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, రఘు రామయ్య గౌడ్, నాగిరెడ్డి, బాల్ రెడ్డి, సాయిబన్న, రైతులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



**కల్వకుర్తి, జూలై8 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు (తిలక్ నగర్)లో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైన సిసి రోడ్డు పనులను మంగళవారం కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బృంగి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో కల్వకుర్తి పట్టణం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుడుముల చంద్రకాంత్ రెడ్డి, షాన్‌వాజ్‌ఖాన్, లక్ష్మి, భాగ్య, పుస్తకాల రాహుల్, జమ్ముల శ్రీకాంత్, నాయకులు పాండురంగారెడ్డి, కుకుడాల శ్రీకాంత్, కిరణ్, నరేష్, నూకం శివ, నాగరాజు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

**దామరగిద్ద, జూలై 8 ప్రభాతవార్త:** నేడు జరిగే భారత బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం దామరగిద్ద మండల అధ్యక్షుడు పెద్దింటి తాయప్ప పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని గత నాలుగు సంవత్సరాలుగాపోరాడుతున్న కార్మికుల మన్ననను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతుంది. కార్మికులకు నష్టాలు కలిగించే లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని లేనియెడల పోరాటం ఉధృతం చేస్తామని దామరగిద్ద మండల కమిటీ హెచ్చరించింది. దామరగిద్ద మండల ప్రజలు సహకరించాలని కోరారు. పివైఎల్. పిడిఎస్‌యు నాయకులు టి.మహేష్, అంజి, కే.మల్లేష్, పి.మధులు కోరారు.

## విద్యార్థులకు పెన్నులు వితరణ

**రాజాపూర్, జూలై8, ప్రభాతవార్త:** విద్య స్వేచ్ఛ ఫౌండేషన్, యువ జాగృతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాజాపూర్ మండలం తిర్మలాపూర్ పాఠశాల విద్యార్థులకు రూ.10000 విలువల పెన్సిల్స్, పెన్నులు, స్కేల్స్, పలకలు 1 నుండి 5 తరగతి విద్యార్థులకు అందజేశారు. యువ జాగృతి ఫౌండేషన్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించడం కోసం, ప్రతిభను వెలికితీయడానికి కృషి చేస్తూసర్కార్ బడిపిల్లల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులుటీచర్లు, విద్యార్థులతల్లిదండ్రులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## భవిత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

**జడ్చర్ల, జూలై8, ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలోని భవిత పాఠశాలను మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మిక తనిఖీ చేశారు. టీచర్లు విజయలక్ష్మి, సునితను భవితలో జరిగే స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్య, లివింగ్ థింగ్స్ టీఎల్ఎం పిజియో థెరపీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఫిజియోథెరపి గురించి పిజియో థెరపిస్టును, పిల్లల తల్లిదండ్రులను భవితలో జరిగే కార్యక్రమాలను అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమములో ఎంఈఓ మంజుల, తహసీల్దార్ నర్సింగరావు ఉన్నారు.

## నేటి సమ్మెను విజయవంతం చేద్దాం

**నారాయణపేట ప్రతినిధి, జూలై 8 ప్రభాతవార్త:** నేడు జరుగు దేశవ్యాప్త ఉద్యోగ కార్మిక కర్షక సమ్మెను విజయవంతం చేద్దామని సిఐటియు జిల్లా నాయకులు డి కృష్ణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణపేట మండల పరిధిలోని కోటకొండ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి పంచాయతీ కార్యదర్శి చాణిక్యరెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసత్వంలోకి నెట్టే 4 కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు. గత మూడు నెలలుగా పెండింగ్లో ఉన్న గ్రామ గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల కోసం జరిగే జూలై 9 సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మికవర్గం అంతా మండల కేంద్రాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమయం నోటీసును అందజేసిన వారిలో గ్రామ పంచాయితీ నాయకులు కిస్టప్ప, సాయిలు, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించండి

◆ తల్లిదండ్రులను కోరిన ఉపాధ్యాయులు

**మద్దూర్, జూలై 8 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు, జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వుల మేరకు మద్దూరు మండలం రెనివట్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం మంగళవారం నిర్వహించార రేణివట్ల పాఠశాలలో ఏక్ పేడ్ మాకేనామ్ 2.0 లో భాగంగా పదవ తరగతి విద్యార్థుల తల్లి పేరు పైన మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజునాయక్ మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని కోరారు. విద్యార్థులను ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం సమయంలో టిఫిన్, మధ్యాహ్నం పోషకాలతో కూడిన భోజనంతో పాటు ఉచిత దుస్తులు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వీరయ్య, సాయికుమార్, భాను ప్రకాష్, రాజేష్, సలవుద్దీన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహాధర్నాను విజయవంతం చేయాలి

**వనపర్తి, జూలై 8 ప్రభాతవార్త:** తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జూలై 12న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన "మహాధర్నా"ను విజయవంతం చేయాలని జిల్లా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షులు భరత్, ప్రధాన కార్యదర్శి వినోద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మహా ధర్నాకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంకా పలు శాఖల్లో రెన్యువల్ చేయని ఉద్యోగులను వెంటనే రెన్యువల్ చేస్తూ జీవోలు జారీ చేయాలన్నారు. చాలీచాలని జీతాలతో జీవితాన్ని గడుపుతున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందజేసి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అవుట్సోర్సింగ్ జేఏసీ జిల్లా అధ్యక్షులు భరత్, ప్రధాన కార్యదర్శి గుంటి వినోద్, ఆర్గనైజర్ సెక్రెటరీ సూగూరు సుభాష్, సహాయ కార్యదర్శి రవి సాగర్, మహేందర్, శ్రీహరి, ధర్మ, శ్రవణ్, రఘు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని వివాహిత మృతి

**వెల్దండ, జూలై8 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రనికి చెందిన కోనేరు అశ్విని(23) తన ఇంట్లోఎవరూ లేని సమయంలో మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో ఫ్యాన్‌కు ఊరి వేసుకొని మృతి చెందినసంఘటన చోటుచేసుకుంది. వివరాలకు వెళ్తే ఊర్కొండ మండలంజగబోయిన్‌పల్లి గ్రామానికి చెందిన మస్కూరి దశరథం కుమార్తె అశ్వినికి వెల్దండ మండల కేంద్రానికి చెందిన కోనేరు వెంకటేష్‌కు గత మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మృతురాలికి పిల్లలు లేరు. ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి తండ్రి మస్కూరి దశరథం ఫిర్యాదు మేరకు భర్త వెంకటేష్, బంధువులు శివ, అంజి, కృష్ణ య్య, చిన్నమ్మ బాలమణిల వేధింపులు తాళలేకనే తన కూతురు మృతి చెందినని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సంఘటనపై కేసు నమోదుచేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లుఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహానికిపోస్టుమార్టంనిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## ఇందిరమ్మ ఇండ్లపై ఆంక్షలు ఎత్తివేయాలి

**చిన్న చింతకుంట, జూలై8 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లపై ఆంక్షలు ఎత్తివేయాలని బిఎస్పి నియోజకవర్గ నేత బుసిరెడ్డి సంతోష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉంద్యాల గ్రామంలో అర్హతఉండి ఇందిరమ్మ ఇల్లురాని నిరుపేదలను కలిసినట్లు ఆయన తెలిపారు. అర్హులను కనీసం గుర్తించలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే సోమవారం అర్హత ఉండి ఇందిరమ్మ ఇల్లు రాని వారితో జిల్లా కలెక్టర్‌ను కలుస్తామని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లపై ఆంక్షలు తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను కోరనున్నట్లు సంతోష్ రెడ్డి తెలిపారు. ఆయన వెంట బీఎస్పీ మండల అధ్యక్షులు దినకర్, ఉంద్యాల పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు, శేఖర్ ఉన్నారు.

# ఘనంగా వైయస్సార్ జయంతి

## పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి దివంగత వైయస్సార్ : మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్ జూలై 8 ప్రభాతవార్త:** దివంగత వైయస్ రాజశేఖరరెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతాంగానికి ఎంతో మేలు చేశారని పేద ప్రజల గుండెల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మక్తల్ నియోజకవర్గ కేంద్రం మంత్రి నివాసంలో వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ పేదోడికి ఉప యోగపడే పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అందులో భాగంగా ముఖ్యంగా అంబులెన్స్ 108,104 సేవలు, ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారం భించి పేదోడి ముఖాల్లో చిరునవ్వును కలిగించిన మహానీయుడు వైఎస్ఆర్ అని కొనియాడారు. ఆయన సేవలను గురించి కొనియాడుతూ మరెన్నో సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించి వారి గుండెల్లో చిరస్థాయిగా వైయస్సార్ నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఏ. రవికుమార్, మార్కెట్ వైస్ ఛైర్మెన్ గణేష్ కుమార్,మాజీ జెడ్పిటిసి లక్ష్మా రెడ్డి, గడ్డంపల్లి హనుమంతు కోళ్ల వెంకటేశ్, కట్టా సురేష్ ,వాకిటి భాస్కర్ బిల్డర్ తాయప్ప,వల్లంపల్లి లక్ష్మణ్, బండారి శేఖర్ అన్ని మండలాల అధ్యక్షులు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**నారాయణపేట, జూలై 8 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఆర్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పుష్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్ర మంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎండి సలీం,





వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

ఎమ్మెల్యే వ్యక్తిగత పిఏ చిట్టి మాధవరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ బోయ శరణప్ప, మహిమూద్ ఖురేషి,యూసుఫ్ తాజ్, పళ్ళ అనిల్, మారుతీ,ఎరుకల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

**బిజినేపల్లి, జూలై8 ప్రభాతవార్త:** వైయస్సార్ ఆవిష్కరించిన పథకాలు సామా న్య ప్రజల జీవితాల్లో తీరని ముద్ర వేసాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు మిద్దె రాములు అన్నారు. పూలే అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఘనంగా నిర్వహిం చారు. జయంతి వేడుకల్లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు, పలుచోట్ల నిరుపేదలకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాల్యానాయక్, మాజీ సర్పంచ్ గంగనమోని తిరుప తయ్య,మాజీ సర్పంచ్‌లు మిద్దె బాలరాజ్,దేవరకొండ రాంచందర్, గోవిందు నాయక్, మాజీ ఎంపిటిసి అంజి, మాజీ ఉప సర్పంచ్ బాలపీరు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కత్తే ఈశ్వర్, మ్యాథరి సత్యం, ఆంజనేయులు, దాసర్ల సైదులు, అబ్బ కర్ణాకర్, మిద్దె కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**పెబ్బేరు, జూలై 8 ప్రభాతవార్త:** దివంగత స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు మంగళ వారం పెబ్బేరు పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ చౌరస్తాలో నిర్వహించారు.అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, స్వీట్‌ల పంపిణి చేపట్టారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షులు వెంకట రాములు యాదవ్, నాయకులు దయాకర్ రెడ్డి, యపర్ల రామ్‌రెడ్డి, యుగంధర్ రెడ్డి, గంధం రంజిత్ కుమార్, మోతె రాములు,షకీల్, భానుప్రకాశ్‌రెడ్డి, అక్కమ్మ, పురురమణ, టి రాములు, జాంగిర్, పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

**దేవరకద్ర, జూలై 8 ప్రభాతవార్త:** జనహృదయ విజేత, సంక్షేమ ప్రదాత, అపర భగీరథుడు, ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన గొప్ప మహానేత డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కౌకుంట్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, కురుమూర్తిస్వామి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఓబిసి అధ్యక్షులు ఆంజనేయులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్, శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**రాజాపూర్, జూలై8 ప్రభాతవార్త:** దివంగత మాజీ ముఖ్యమంత్రి డా. వైయస్ రాజశేఖర్ రెడ్డిని రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు భగవంతునితో సమానంగా ఆరాధిస్తారని, మాటతప్పని మడమతిప్పని గొప్ప ప్రజానాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనిరాజాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నా రు. మంగళవారం ఆయన జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య యాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ జవాజి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ గొప్ప రాజకీయ దురంధరుడు డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనికొనియాడారు.ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రమాణ స్వీకారం చేయగానే ఎల్బీ స్టేడియంలో ప్రజా సమక్షంలో ఉచిత కరెంటు దస్త్రంపై తొలి సంతకం చేసిన మహా నాయకుడని కొనియాడారు. ప్రజలకు ఆరోగ్యశ్రీద్వారా మేలైనవైద్యాన్ని అందించినఘనత ఆయనదని కొనియాడారు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రబ్బర్ చెప్పులు వేసుకున్న హరీష్ రావుకు వేలకోట్లు ఎలా వచ్చాయి

మొదటి పేజీ తరువాయి భాగం..

దయ్యాలుగా అభివర్ణించింది. రబ్బర్ చెప్పులతో తిరిగే హరీష్ రావుకు 2000 ఎకరాల భూమి, వేలకోట్ల ఆస్తులు,విదేశాల్లో వ్యాపారాలు ఎలావచ్చాయి. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ముఖ్య మంత్రి ని ఉద్దేశించి నీళ్లలో దూకి ఆత్మహత్య చేసుకో అనడానికి కేటీఆర్ ఎవడు, నిజానికి ఆత్మ హత్య చేసుకోవాల్సింది కేటీఆర్. ఫోన్ ట్యాపింగ్‌లతో భార్యాభర్తల సంభాషణలు విని, సంసారాలు కూల్చారు, వేల కోట్లు దోచుకున్నారు, తెలంగాణను భ్రష్టు పట్టించారు అన్నారు. మా ముఖ్య మంత్రి పరిపాలన ఇతర రాష్ట్రాలు ప్రశంసిస్తున్నాయి, తెలంగాణను ఫాలో అవుతున్నాయి. కల్వ కుర్తి పంప్‌హౌస్ నుంచి నీళ్లు ఎప్పుడు ఎత్తిపోయాలో మాకు తెలుసు, కల్వకుర్తి పంపులు ప్రతి ఏటా జులై చివరిలో లేదా ఆగస్టు ఒకటో తేదీన స్విచ్ ఆన్ చేసి వానాకాలం పంటలకు నీళ్లు అందించే ఆనవాయితీ ఉంది, ఆనవాయితీ ప్రకారం ఈసారి కూడా అదే సమయంలో నీళ్లు ఇస్తాం అని, రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటాం, అధికారుల అభిప్రాయాలను గౌరవిస్తాము, మీలా అధి కారులను పక్కాకు పెట్టి, మేమే మేధావులమని చెప్పుకోం, మీరు మేధావులు కట్టిన కాళేశ్వరం కూలిపోయింది.పాలమూరు రంగారెడ్డి 90శాతం పనులు పూర్తయ్యాయని అబద్ధాలు మాట్లాడు తున్నారు. మూడేళ్లలో పాలమూరు రంగారెడ్డి పూర్తి చేస్తామన్నారు, కానీ పాలమూరు రంగారెడ్డి తర్వాత ప్రారంభమైన కాళేశ్వరం పూర్తయిన ఆనాడు కెసిఆర్ ను ప్రశ్నించని దద్దమ్మ అల వెంకటేశ్వర్ రెడ్డి. ఆనాడు కోయిల్ సాగర్ కు వచ్చిన హరీష్ రావు, కోయిల్ సాగర్ ఆయకట్టును పెంచి 50వేల ఎకరాలకు నీళ్లు ఇస్తామని చెప్పి, ఐదు ఎకరాలకు కూడా అదనంగా నీళ్లు ఇవ్వలేదు. పదేళ్ల ఎమ్మెల్యేగా ఉండి ఐవిఆర్ సెల్ కంపెనీతో, కోయిల్ సాగర్ పెండింగ్ పనులు పూర్తి చేయిం చలేని సన్యాసి మాజీ ఎమ్మెల్యే. కర్ణాటక ముఖ్యమంత్రి గారితో మాట్లాడి, యాసంగిలో చరిత్రలో మొదటిసారి కోయిల్ సాగర్ కు నీళ్లు తీసుకోవచ్చం. మీ పాలనలో కోయిల్ సాగర్ కు కూతవేటు దూరంలో ఉన్న అడివి అజిలాపూర్ కు నీళ్లు ఇవ్వలేదు. పదేళ్ల నువ్వు ఎమ్మెల్యేగా ఉండి నియో జకవర్గంలో ఒక డిగ్రీ కాలేజ్, ఒక జూనియర్ కాలేజ్, ఒక్క హాస్పటల్ ను నిర్మించిన పాపాన పోలేదు, దేవరకద్ర నియోజకవర్గాన్ని మునిసిపాలిటీ చేయలే, కోర్టు ఏర్పాటు చేయలే. కానీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో భూత్పూర్, అడ్డాకుల్, మూసాపేట్ మండలాలలో వేల కోట్ల విలువైన నల్ల మట్టిని దోచుకున్న దొంగవు నువ్వు. నీ కారణంగా దేవరకద్ర రెండుగా చీలింది, రైల్వే అధికారులను కలిసి అండర్ ప్లస్ వేయాల్సిన చోట, నీ కమిషన్ల కక్కుర్తికి దేవరకద్రలో ఫ్లైఓవర్ కట్టి దేవరకద్రను భ్రష్టు పట్టించావ్. నువ్వు కట్టిన చెక్ డ్యామ్ లు అన్ని నాసిరకంగా ఉన్నాయి, నువ్వు కట్టిన సంవత్సరానికే అల్లిపూర్ చెక్ డ్యామ్ లీకేజీలు వచ్చాయ్. నువ్వు ఎంత పెద్ద అవినీతి పరుడవో, నియోజకవర్గ ప్రజలకు తెలుసు..బిడ్డ మాట్లాడం నేర్చుకో. మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందంటూ ఏదేదో భ్రమలో ఉన్నావ్, నిన్ను ఎప్పుడో నియోజకవర్గ ప్రజలు మరిచి పోయారు. కాలువలకు భూసేకరణ చేయకుండా పాలమూరు రంగారెడ్డి నిర్మించారు, మీరు ప్రారంభించిన ఒక్క మోటార్ నీళ్లు వెళ్లే దారిలేక గంటకే ఆఫ్ చేశారు. కాలువలు నిర్మించకుండా ప్రాజెక్టులు కడితే నీళ్లు ఎట్లా పోతాయి. పదేళ్ల ఎమ్మెల్యేగా నువ్వు చేయలేని పనులు, నేను 18 నెలల కాలంలో చేశా,18 నెలలలో నియోజకవర్గానికి 500 కోట్ల నిధులు నియోజకవర్గానికి తీసు కువచ్చా. చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్‌లో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, కురు మూర్తి స్వామి దేవస్థానం వద్ద 110 కోట్లతో ఎలివేటేర్ కారిడార్‌తో కూడిన ఘాట్ రోడ్ వంతెన. 72 కోట్లతో విద్యుత్ సబ్స్టేషన్లు, 35 కోట్లతో దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, 5కోట్లతో కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి, అడివి అజిలాపూర్ లిఫ్ట్‌కు 35కోట్లు, 34 లక్షల నిధులతో కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద మంచినీటి పరిష్కారం కోసం ట్యాంకుల నిర్మాణం, కోయిల్ సాగర్ టూరిజం డెవలప్మెంట్ కు 3 కోట్ల నిధులు. దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో డిగ్రీ కాలేజ్, కోర్ట్, దేవరకద్ర మున్సిపాలిటీ మరియు చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఇంటర్ కాలేజ్,ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో రోడ్లు వేయడం జరిగింది. నియోజకవర్గ ప్రజలకు 3,500 ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరిగింది. త్వరలో దేవరకద్ర నియోజకవర్గంలో సర్కిల్ ఆఫీస్, సబ్ రిజిస్టర్ ఏర్పాటు చేయబోతున్నాం. నాసిరకం చెక్ డ్యామ్‌ల గురించి తప్ప నియోజకవర్గంలో నువ్వు చెప్పుకోవడానికి చేసింది ఏమీ లేదు. అబద్ధాలు మాట్లాడితే హరీష్ రావు గురించే కాదు ఎవరైనా నిలదీస్తాం.. ఎవరినైనా ఎదురిస్తాం అని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు.

# లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జూలై 8 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించి మంజూరైన ఇండ్లను త్వరగా నిర్మించుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె నారాయణపేట మండలంలోని జాజాపూర్ గ్రామంలో బేస్ మెంట్ స్థాయిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు తొందరగా ఇండ్లు నిర్మించుకుంటే డబ్బులు కూడా ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. అధికారులు సైతం లబ్ధిదారులను ఒకటి రెండు సార్లు కలిసి ఇండ్ల నిర్మాణాలను వేగిరం చేయించాలన్నారు. ఇండ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుక సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, ఏఈ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణుల ఆరోగ్యంపై ఆరా తీసిన కలెక్టర్

**నారాయణపేట టౌన్, జూలై 8 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం అప్పక్ పల్లి వద్ద గల ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో మంగళ వారం జరిగిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి వెళ్లిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆస్పత్రిలో వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణీలను ఆప్యాయంగా పలకరించి ఆరోగ్యం ఎలా ఉందని వారిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణిలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని, వైద్యుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలని ఆమె వారికి సూచించారు. ఆస్పత్రిలో అప్పుడే పుట్టిన ఓ శిశువును చూసిన కలెక్టర్ ఆ శిశువు తండ్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రిలో తాగునీటి సమస్య ఏర్పడిందని ప్రిన్సిపల్ డా. రామ్‌కిషన్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆమె మిషన్ భగీరథ ఈఈతో ఫోన్‌లో మాట్లాడి మిషన్ భగీరథ ప్రత్యేక పైప్‌లైన్‌ను ఆస్పత్రికి ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కూడా ఏర్పాటు చేసే విధంగా చూడాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశిస్తామని కొందరు రోగుల బంధువులు అడిగిన ప్రశ్నకు కలెక్టర్ బదులిచ్చారు.

# ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలకు కట్టుబడి ఉన్నాం

◆ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జూలై 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కల్లో ఇచ్చిన అన్ని హామీలకు కట్టుబడి ఉందని,అప్పుల పాలు చేసిన రాష్ట్రాన్ని చక్కదిద్దుకుంటూనే ఒక్కొక్కటిగా హామీలను నెరవే స్తూ వస్తున్నదని శాసనసభ్యులు తూడిమేగారెడ్డి అన్నారు. మంగళ వారం వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాది ముబారక్, సిఎంఆర్‌ఎఫ్ చెక్కు లను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక గడచిన 18 నెలల కాలంలో జాబ్ క్యాలెండర్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 60వేల ఉద్యోగాలిచ్చాం అన్నారు. ప్రెస్‌మీట్‌లలో మాట్లాడే కేటీఆర్ ఎల్బీ స్టేడియానికి వస్తే 60వేల ఉద్యోగులను లెక్కపెట్టి చూపిస్తామన్నారు. రేపు జరగ బోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్, సర్పంచు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అభ్యర్థులు దొరకడం కూడా కష్టమేనని జోస్యం చెప్పా రు. పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, పెళ్లయిన వారిని రేషన్‌కార్డులో చేర్చలేదనిగుర్తు చేశారు. ప్రభుత్వం ప్రవేశపె ట్టిన రైతుబంధు,రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఉచిత కరెంటు, రాయితీపైన పనిముట్లు, రేషన్ బియ్యం,రేషన్ కార్డుల పంపిణీ మహిళలకు ఉచిత బస్సు, విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ విద్య, వసతి గృహాల్లో ఉండే విద్యా ర్థులకు 40 శాతం మేస్ చార్జీల పెంపు, లాంటి అనేక పథకాలు నేడు నిరుపేదలకు అందుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, వనపర్తి పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్లు వైస్ చైర్మన్లు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలను పరిశుభ్రంగా నిలుపుకోవాలి

- సెంట్రల్ బృందం ఎస్ఎస్‌జి ఆర్‌ఐ లింగమయ్య



గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సెంట్రల్ బృందం సభ్యులు

**వెల్దండ, జూలై 8 ప్రభాతవార్త:** గ్రామాలలోని ప్రజలు తమ నివా సాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాలనీలకు మురుగు నీరు వెళ్ళనీయకుండా పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని సెంట్ర ల్ బృందం ఎస్ఎస్‌జి ఆర్‌ఐ లింగమయ్య అన్నారు. వెల్దండ మండలంలోని రాచూరు గ్రామంలో సెంట్రల్ బృందం సభ్యులు గ్రామంలో ఉన్న మురుగు కాలువలు, ఇంకుడు గుంతలు, నర్సరీ పాఠశాల ఆవరణను పరిశీలించారు. సెంట్రల్ బృందం ఎస్ఎస్ జి.లింగమయ్య మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠ శాలలో విద్యార్థులు చదివించేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సహిం చాలని నాణ్యమైన విద్య అందించడంతో పాటు గదులను ఆవర ణను పరిశుభ్రంగా ఉంచాలని, గ్రామంలోని ప్రజలు మురుగునీరు బయటకువెళ్ళనీయకుండా ఆవరణలోనే ఇంకుడు గుంతలను ఏర్పాటుచేసుకోవాలని చేసుకున్నట్లయితే సిజినల్ వ్యాధులకు స్వస్తి చెప్పినట్లు అవుతుందని పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకాన్ని అధిక ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ. చంద్రశేఖర్, ఎస్‌బిఎం.ఊషన్న, ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్, పంచా యతీ కార్యదర్శి పద్మ, మురహరిచారి, టి.ఏ.సత్యనారాయణ, ఉపాధిహామీ సిబ్బంది క్రాంతికుమార్, రామార్జున్ నాయకులు పడకంటి వెంకటేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# పంచాయతీ కార్యదర్శులు ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధించాలి

-జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు

**గద్వాలటౌన్, జూలై 8, ప్రభాతవార్త :** పంచాయతీ కార్యదర్శులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయిలో పూర్తిగా అమలు చేసి,ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు.మంగళవారం కలెక్టరే ట్లోని కాన్ఫరెన్స్ హాల్ నందు భారత ప్రభుత్వం పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదుల విభాగం,సిబ్బంది,పెన్షన్ల మంత్రి త్వశాఖ సహకారంతో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ,పంచాయతీరాజ్ గ్రామీణాభి వృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం,గ్రామసభలపై ప్రతీ మండల నుంచి ఇద్దరు చొప్పున పంచాతీయ కార్యదర్శులకు శిక్షణ నిర్వహిం చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాభి వృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర అత్యంత ముఖ్యమైందని తెలిపారు.గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలంటే,కార్యదర్శి ప్రజలతో బలమైన అనుబంధాన్ని నెలకొల్పి,వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకుంటూ నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం గ్రామస్థాయిలో జరుగుతున్న ప్రతి కార్యక్రమం, ప్రజలకు అందాల్సిన సేవలు, అభివృద్ధి పనులు గ్రామసభల ద్వారానే చర్చించబడాలని,అవి పారదర్శకంగా జరగాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హుల వరకు చేరేలా చూడాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడికి ముఖ్యమైన సాధనం అని పేర్కొన్నారు. ప్రజలెవరికైనా ప్రభుత్వ పనులు, పథకాల వివరాలు తెలుసుకునే హక్కు ఉందని, అందువల్ల పంచా యతీ కార్యదర్శులు తమ వద్ద ఉన్న సమాచారాన్ని పారదర్శకంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు.మహిళా సంఘాలు,యువజన సంఘాలు, గ్రామ స్థాయిలోని ఇతర సంఘాలతో కలిసి పని చేస్తే అభివృద్ధి వేగంగా సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామాల్లో అన్ని రంగాలలో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ, జిల్లాలో ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కార్యదర్శులకు సూచిం చారు.ఈ కార్యక్రమంలో డీపీవో నాగేంద్రం,మాస్టర్ ట్రైనర్ రిటైర్డ్ డీపీవో కృష్ణ, శిక్షణ రీజినల్ మేనేజర్ డా.హన్మంతు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలి

భూ పరిపాలన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**చిన్న చింతకుంట, జూలై 8 ప్రభాతవార్త :** ఓటరు జాబితాను ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని భూ పరిపాలన అద నపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బిఎల్‌వోలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రం లోని రైతు వేదికలో బిఎల్ఓ శిక్షణ కార్యక్ర మానికి హాజరై మాట్లాడుతూ బిఎల్ఓ లకు ఓటరు జాబితా పై పలు సూచనలను చేశారు. ఓటర్ జాబితాలో ఫామ్ 6, ఫామ్ 8లపై బిఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేర్లు తప్పుగా రావడం, మరణించిన వారిని తొలగించడం, ఓటరు బదిలీలపై బూత్ లెవల్ అధికారులు సమగ్రంగా విచారించి ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎల్లన్న, డిప్యూటీ తహసిల్దారు చంద్రశేఖర్, ఆర్ఐలు తిరుపతయ్య, అమీర్ ఉన్నారు.

# సాయం పొంది..తిరిగి సాయం అందించి..

- పాలమూరు రెడ్డి సేవాసమితికి రూ.20వేల ఆర్థికసాయం అందజేసిన ఆవంచ మనోహర్‌రెడ్డి



**మహబూబ్‌నగర్, జూలై8, ప్రభాతవార్త:** సేవా కార్యక్ర మాల్లో ముందంజలో ఉన్న పాలమూరు రెడ్డి సేవ సమితి ద్వారా పేద విద్యా ర్థికి బిటెక్ చదువు కోసం రూ.20 వేలు ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ పేద రెడ్డి విద్యార్థులతో పాటు ఇతర వర్గాల పేద విద్యార్థులకు కూడా సేవ సమితి నుంచి సహాయం అందిస్తున్నామని, ఇందులో భాగంగానే బండమీదిపల్లి గ్రామానికి చెందిన యం.భాస్కర్ భాగ్య దంపతుల కుమార్తె అర్చన ఉన్నత చదువుకోసం రూ.20 వేల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. అలాగే గతంలో సేవా సమితి నుంచి ఆర్థిక సహాయం పొందిన తిమ్మాజీపేట మండలం, ఆవంచ గ్రామానికి చెందిన పేద విద్యార్థి బీసం మనోహర్ రెడ్డి తన చదువు ముగించుకుని ఉద్యోగం లో చేరిన సందర్భంగా తన వంతు సహాయంగా పేద విద్యార్థులకు సహాయం చేయాలని తిరిగి సేవా సమితికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సేవా సమితి ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, కోశాధికారి మల్లు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ప్రచార కార్యదర్శి సురేందర్ రెడ్డి, సభ్యులు పరమేశ్వర రెడ్డి మనోహర్ రెడ్డి, జాగృతి ఫౌండేషన్ నిర్వాహకుడు మధుసూదన్‌రెడ్డి అభినందించారు.

# రేషన్ కార్డుదారులు ఈకేవైసీ తప్పనిసరి నమోదు చేయాలి

◆ మండల అధికారుల సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్

**నవాబుపేట, జూలై 8 ప్రభాతవార్త:** ప్రభుత్వం త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా పారదర్శకతను నిర్ధారిం చడానికి, ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) దుర్వినియోగాన్ని అరి కట్టడానికి ప్రభుత్వంరేషన్ కార్డుదారులకు ఈకేవైసీ ప్రక్రియ తప్పనిసరి అని మండల అధికారులు తాసిల్దార్ శ్రీనివాస్ తెలి పారు. ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయడానికి 2025 ఈనెల జూలై 31ని చివరి తేదీలోపు ఆయా గ్రామాలలోని రేషన్ డీలర్ల దగ్గర పీకేవైసీ చేసుకోవచ్చని ప్రతి రేషన్ కార్డులో ఉన్న సభ్యులు కూడా పీకేవైసీ చేసుకోవాలని తెలియజేశారు అయితే ఇప్పటికీ పలువురు రేషన్‌కార్డుదారులు ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసు కొని వారు తప్పనిసరిగా రేషన్ కార్డు దారులు కార్డులో ఉన్న సభ్యులు కూడా ఆయా డీలర్ షాపులలో పీకేవైసీ చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు డిప్యూటీ తాసిల్దార్ సువర్ణతో పాటు రేషన్ డీలర్ల సభ్యులు పాల్గొన్నారు.

# ముదిరాజుల బోనాల సంబరాలు

**ధన్వాడ, జూలై 8 ప్రభాతవార్త:** ధన్వాడ గ్రామంలో ఎన్టీఆర్ కాలనీలో పోలేరమ్మ దేవత ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ధన్వాడ ముదిరాజ్ కులస్థులు డప్పులు డోలు వాయిస్తూ గ్రామ పురవీధుల గుండా బోనాలను ఊరేగించారు. అమ్మవారికి పాడిపంటలు వర్షాలు బాగా కురవాలని మొక్కు బడులు చెల్లించారు. ఈ ఊరేగింపులో నారాయణపేట జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నీరటి నర్సిములు నాయుడు ముదిరాజ్, నీరటి రామచంద్రి ముదిరాజ్, నీరటి నారాయణ ముదిరాజ్, వెంకట్ రాములు, వెంకటయ్య, అర్గట్‌పల్లి కథలప్ప ముదిరాజ్, కుల సంఘం నాయకులు యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**మల్దకల్ జూలై 8, ప్రభాతవార్త:** మల్దకల్ మండల కేంద్రంలో రైతువేదికలో పకృతి వ్యవసాయం పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఏఓ రాజశేఖర్ గారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చెయ్యడం వలన మంచి లాభాలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా అయిజ మండలం, చిన్న తండ్రపాడు గ్రామస్థుడైన బి.శ్రీను ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించారు.ఘనామృతం,జీవామృతం వాడ టం వలన నేల స్వభావం మరి సారవంతం అవుతుందని అదే విధంగా న్యానమైన పంటలను పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమం లో పకృతి వ్యవసాయ దారుడు గణపతి రెడ్డి, రవి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలి

**మద్దూర్,జూలై 8 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల పరిధిలోని ఆయా గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు చేప ట్టాలని మంగళవారం మద్దూర్ మండల్ పరిషత్ కార్యాల ఎంపీ డీవో నరసింహారెడ్డి పిటడబ్ల్యు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించి క్రిమి కీటకాల నుండి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని ప్రజలు రోగుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు కార్యక్రమంలో అనంతమ్మ. వెంకటమ్మ ఆంజనేయులు. నర్సింలు సాయప్ప పాల్గొన్నారు.

# ఊట్కూర్ మండల కేంద్రానికి మంత్రి శ్రీహరి రాక

**ఊట్కూర్, జూలై 8 ప్రభాతవార్త:** నేడు ఉదయం 10:00 గంట లకు ఊట్కూరు మండల కేంద్రంలో శ్రీ కృష్ణా నగర్ చౌరస్తాలోని పంచ మసీద్ దగ్గర అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పట్టాల పంపిణీ చేయడానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మత్స్యశాఖ, డైరీ డెవలప్మెంట్, క్రీడాలు, మరియు యువజనుల శాఖ, మంత్రి వర్యులు డా. వాకిటి శ్రీహరి వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంద ర్భంగా ఊట్కూర్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరారు.

# ఇందిరా శక్తి సంబరాల సమైక్య సమావేశం

**నవాబ్‌పేట, జూలై8 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాలలో భాగంగా మండల కేంద్రంలోని ఎంఎంఎస్ ఆఫీసులో గ్రామ సంఘం అధ్యక్షుడు కార్యదర్శి కోశాధికారిలకు ఎంఎంఎస్ ఓబి ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలకు సంబంధించి మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. గత సంవత్సరం మహిళా సంఘ సభ్యులు చేపట్టిన కార్యక్రమాల గురించి మరియు 2025 వరకు సంబంధించి మహిళా శక్తి సంబరాలు భాగంగా ప్రణాళిక తయారు చేయడం జరిగింది. క్రమ సంఘం లీడర్లకు. మిగిలి పోయిన సంఘాల లేని పేద నిరుపేదలను సంఘాలలో చేర్చుట, సంఘం సభ్యులకు చదువురాని వారిని గుర్తించి చదువు చెప్పిం చడం,15 నుంచి 18 సంవత్సరాల కిశోర బాలికలకు సంబంధించి సంఘాలు ఏర్పాటు చేయుట, వికలాంగుల సంఘాలకు సంబం ధించి కొత్త సంకలు తయారు చేయుట 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు సంఘాలు ఏర్పాటు చేయుట గురించి కార్యక్రమంలో డిపిఎం రామ్మూర్తి తెలియజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శి ఎంఎంఎస్ ఓబిలు, ఏపీఎం జీవరత్నం సీసీలు శ్రీనిధి మేనేజర్, అకౌంటెంట్, అంగన్వాడీ టీచర్లు పాల్గొనడం జరిగింది.

# భూభారతి సదస్సుల దరఖాస్తులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

**ఖిల్లాగణపురం. జూలై8. ప్రభాతవార్త:** భూభారతి రెవెన్యూ సదస్సులలో రైతులు ఇచ్చిన దరఖాస్తులను జాగ్రత్తగా భద్రప రచాలని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సులను మండలంలో ఎన్ని దరఖాస్తులు వచ్చినాయి వాటిని ఆన్లైన్ చేశారా లేదా అని పరిశీ లించారు. రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు చేసుకున్న ప్రతి ప్రతి రైతు సమస్యను పరిష్కరిస్తామని ఒకవేళ పరిష్కరించలేని సమస్యలు ఉన్న దానికి సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉందని సూచించారు. స్థానిక తహసిల్దార్ సుగుణ డిప్యూటీ తాసిల్దార్ లక్ష్మీ మ్రకాంత్ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# జులై 9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

**మక్తల్ టౌన్, జూలై 8 ప్రభాతవార్త :** నేడు దేశవ్యాప్త జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని టియుసిఐ రాష్ట్ర కోశాధికారి ఎస్. కిరణ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (అనుబంధం టియుసిఐ) ఆధ్వ ర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా టియుసిఐ రాష్ట్ర కోశాధికారి ఎస్ కిరణ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని కార్మిక వర్గాన్ని బలిచ్చేందుకు తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోసం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 2025 జూలై 9న జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో సంఘటిత రంగంలో ఉన్నా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టియుసిఐ గొల్లపల్లి రాజు, జి.క్రిష్ణయ్య, బండారి మల్లేష్, నరేందర్, రాయకూడ అంజి, బండారి బాలు, జగ్గలి బాబు, అంజన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.